సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 6 । మే । 2023



పేదలకు వరం.. సర్కారు వైద్యం
చింతూరు ఏరియా ఆస్పత్రిలో అధునాతన వైద్యసేవలు క్రమేపీ అందుబాటులోకి వస్తున్నాయి.
IIలో



అర్ధరాత్రి జీపు బోల్తా
పెదబయలు మండలంలో జీపు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.
IIలో



సింహగిరికి వైశాఖ పౌర్ణమి శోభ
వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.
IIలో

న్యూస్‌రీల్

అటవీశాఖ అనుమతికి వినతి



డీఎఫ్‌వో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్లు

అనంతగిరి: మండలంలోని నిలిచిపోయిన రోడ్ల నిర్మాణానికి సంబంధించి అటవీశాఖ అనుమతులు మంజూరుచేయాలని డీఎఫ్‌వో వినోద్ కుమార్‌ను జెడ్పీటీసీ దీసరి గంగరాజు, బొర్రా, టోకూరు సర్పంచ్లు అప్పారావు, మోస్య తదితరులు కోరారు. శుక్రవారం బొర్రా పంచాయతీకి ఇచ్చిన ఆయనకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుమ్మకోట-శంకుపర్తి, పట్కదవడ, టొనిమోరి, బొగింజ గ్రామాలకు మంజూరైన రోడ్డు పనులు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయాయన్నారు. వెంటనే అనుమతులు వచ్చేలా అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి కృషి చేయాలని కోరారు.

మోతుగూడెం సర్పంచ్‌కు సత్కారం



మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీతను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

మోతుగూడెం: ఉత్తమ పంచాయతీగా మోతుగూడెంను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన నేపథ్యంలో సర్పంచ్ ఆకేటి సీతను శుక్రవారం సత్కరించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డును ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నం, జెడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ అమల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, మండల నాయకులు కోట్ల కృష్ణ, కన్నారావు, మోతుగూడెం ఉపసర్పంచ్ మీనా సుజాత, వార్డు సభ్యులు మల్లూరి రమాదేవి, మంచిని శెట్టి కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శివకిరణ్

అరకులోయ రూరల్: స్థానిక మెజిస్ట్రేట్ కోర్టులో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జడ్జి శివకిరణ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక న్యాయవాదులు, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని కోరారు. గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మురళీమోహన్, రత్నంరాజు, సింహాచలం, ప్రభాకర్ పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియం పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఈఎన్‌సీ శ్రీనివాస్

చింతపల్లి రూరల్: మండలంలోని తాజంగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాన్ని శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్(ఈఎన్‌సీ) ఇన్ చీఫ్ శ్రీనివాస్ పరిశీలించారు. నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న లంబసింగి ప్రాంతంలో మ్యూజియం నిర్మాణ పనులు పూర్తయితే గిరిజనులకు మరింత ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పర్యాటకుల సంఖ్య కూడా ఏటా భారీ సంఖ్యలో పెరుగుతుందన్నారు. మ్యూజియం నిర్మాణానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత ఇస్తుందన్నారు. రానున్న కాలంలో లంబసింగిని మరింత అభివృద్ధి చెందిన ఆంధ్రా కశ్మీర్‌గా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ డీవీఆర్‌ఎం రాజు, డీఈ చాణిక్యరావు, జేఈలు రఘు, యాదకిషోర్ పాల్గొన్నారు.

విశాఖ హబ్‌గా
పర్యాటక భూములు

- హబ్ పరిధిలో 427 ఎకరాలున్నట్లు గుర్తించిన పర్యాటక శాఖ
- రెవెన్యూ శాఖ పరిధిలో వందల ఎకరాల బదలాయింపు పెండింగ్
- పెండింగ్ భూముల వివరాల నివేదిక సిద్ధం చేసిన పర్యాటక శాఖ
- త్వరలోనే బదలాయింపు ప్రక్రియ
- డీపీఆర్‌ల ప్రకారం ఎంవోయూ సంస్థలకు భూ కేటాయింపులకు ప్రణాళికలు





సాక్షి, విశాఖపట్నం : సహజ అందాలతో అలరారే ఉత్తరాంధ్ర పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఒకవైపు సాగర సోయగాలు.. మరోవైపు ఎత్తైన తూర్పు కనుమల అందాలు ప్రపంచ పర్యాటకులను కట్టిపడేస్తుండగా.. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా ప్రాజెక్టులకు ఇటీవల విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందుకు అవసరమైన భూములను ఆయా ప్రాజెక్టులకు అప్పగించేందుకు టూరిజం శాఖ కసరత్తు ప్రారంభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న పర్యాటక భూముల పరిధిని విశాఖ హబ్‌గా ఏర్పాటు చేస్తూ.. ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుగుణంగా భూ కేటాయింపులు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. విశాఖ జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా.. టూరిజం ప్రాజెక్టులకు కసరత్తు చేస్తున్నారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జరిగిన పర్యాటక ఒప్పందాల్లో సింహభాగం ఇన్వెస్టర్లు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర

విశాఖ హబ్‌లో పర్యాటక భూముల వివరాలివీ...

అల్లూరి సీతారామరాజు జిల్లాలో	43.1 ఎకరాలు
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో	296.15 ఎకరాలు
శ్రీకాకుళం జిల్లాలో	32.78 ఎకరాలు
విజయనగరం జిల్లాలో	48.8 ఎకరాలు
పార్వతీపురం మన్యం జిల్లాలో	6.25 ఎకరాలు
మొత్తం విశాఖ హబ్ పరిధిలో	427.08 ఎకరాలు

జిల్లాలను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. జీఐఎస్‌లో పర్యాటక రంగానికి సంబంధించి రూ.8,806 కోట్లతో 64 ప్రాజెక్టులు ఉత్తరాంధ్రకు రానున్నాయి.

భూ బదలాయింపు ప్రక్రియ షురూ

విశాఖ హబ్ పరిధిలో 39 పార్శిళ్లలో 427.08 ఎకరాలున్నట్లుగా గుర్తించారు. ఇందులో ఎక్కువ మొత్తం భూములు ఇంకా బదలాయింపునకు నోచుకోలేదు. ఈ ప్రక్రియను టూరిజం శాఖ ప్రారంభించింది. ఆయా జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ పరిధిలో ఉన్న పర్యాటక భూముల బదలాయింపు వేగవంతం చేయాలని టూరిజం అధికారులు లేఖలు రాశారు. ప్రస్తుతం వీటికి సంబంధించిన ఫైల్స్ ఆయా మండల తహశీల్దారుల పరిధిలో ఉన్నాయి. వీటిని త్వరగా క్లియర్ చేయాలంటూ కలెక్టర్లు ఆదేశాలు జారీ చేయనున్నారు. భూ బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యేలోపు.. ఎంవోయూలు చేసుకున్న పెట్టుబడిదారుల నుంచి కూడా ఫైల్స్ కదిలేలా చేస్తున్నారు. ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌తో పాటు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్(పీఎంయూ) కూడా అందించాలంటూ ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ డీపీఆర్, పీఎంయూలు అందితే.. మరోవైపు బదలాయింపు ప్రక్రియ పూర్తయితే.. ఏ ప్రాజెక్టుకు ఏ ల్యాండ్ అవసరమవుతుందనే దానిపై నిర్ణయించి.. ఆయా సంస్థలకు కేటాయింపులు చేపట్టే ప్రక్రియను ప్రారంభించనున్నారు.

సరిహద్దుల గుర్తింపునకు రోవర్ సర్వే

మరోవైపు.. భూముల బదలాయింపు పూర్తయిన తర్వాత.. పర్యాటక భూముల సరిహద్దులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నారు. దీనిపై కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖపట్నం, భీమిలి ఆర్డీవోతో టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి భేటీ అయ్యారు. డ్రోన్ సర్వేకు అనుమతులు లేని కారణంగా రోవర్స్ సర్వే నిర్వహించి హద్దులు గుర్తించనున్నారు. ప్రస్తుతం రోవర్స్ విజయనగరం జిల్లాలో భూహక్కు రీ సర్వేలో ఉన్న కారణంగా వారం రోజుల్లో సర్వే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

193 మందికి రూ.1.91కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ స్వాతిరాణి

లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ కల్యాణమస్తు- షాదీతోఫా జమ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు- షాదీ తోఫాలో జిల్లాలోని 193 మందికి రూ.1.91 కోట్లను ప్రభుత్వం జమచేసింది. శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వైఎస్సార్ కల్యాణమస్తు- షాదీతోఫా ప్రోత్సాహక నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ,రాష్ట్ర జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు వారు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో బీసీలు 16మంది, దివ్యాంగులు ఇద్దరు, ఎస్సీలు 16మంది, ఎస్టీలు 159మంది ఖాతాల్లో జమ అయిందన్నారు. అరకు నియోజకవర్గంలో 81,పాడేరులో 48,రంపచోడవరంలో 64 మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేదకుటుంబాల చెల్లెమ్మలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కార్యక్రమం అండగా నిలుస్తుందన్నారు. ఎస్సీ,ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహాలకు రూ.1.2 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీల కులాంతర వివాహాలకు రూ.75 వేలు, మైనారిటీలకు రూ.లక్ష, దివ్యాంగులకు రూ.1.5 లక్షల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ మురళి పాల్గొన్నారు.



పున్నమి చంద్రుడు కనువిందు చేశాడు. విశాఖ నగరంలో జనానికి వినోదాన్ని పంచాడు. శుక్రవారం రాత్రి ఆకాశంలో నిండు చందమామను చూసి నగరవాసులు మంత్రముగ్ధులయ్యారు. ఈ రమణీయ దృశ్యం ఎంతగానో ఆకట్టుకుంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి

దొండపర్తి (విశాఖ దక్షిణ): టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ పాసైన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు గల కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ ప్రాంతంలో బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, 9502874304, 9908104113 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రతిరోజూ కుమ్మేస్తున్న వర్షం

- ఉదయం మంచు
- మధ్యాహ్నం చుర్రుమనిపిస్తున్న భానుడు
- సాయంత్రం దంచికొడుతున్న వాన



పాడేరులో ఉదయం కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో ప్రతిరోజూ ఏదొక చోట వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం మంచు కురుస్తోంది. మధ్యాహ్నం ఎండ చుర్రు మనిపిస్తోంది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోతోంది. ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తోంది.

డుంబ్రిగుడ: మండలంలోని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది.దీంతో శుక్రవారం అరకు వారపు సంతకు వచ్చిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జి.మాడుగుల: మండలంలో శుక్రవారం ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షానికి వీధులు, రోడ్లు జలమయం అయ్యాయి. పాడేరు- జి.మాడుగుల, చింతపల్లి, వంజరి, నుర్మతి, సొలభం రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు కాసేపు అంతరాయం ఏర్పడింది.

గూడెంకొత్తవీధి: మండలంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఏకధాటిగా సుమారు నాలుగు గంటలపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెదవలసలో వారపు సంతకు వచ్చిన వ్యాపారులు, గిరిజనులు ఇబ్బంది పడ్డారు. వాగులు పొంగి ప్రవహించాయి. రహదారులు ముంపునకు గురయ్యాయి.



గూడెంకొత్తవీధిలో కురుస్తున్న భారీ వర్షం



పాడేరు మెయిన్‌రోడ్డులో ఎండకు గొడుగులను ఆశ్రయించిన సంతలోని చిరు వ్యాపారులు



పాడేరు-నక్కలపుట్టు రోడ్డులో కురుస్తున్న వర్షం

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశానికి హాజరైన వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా వైద్య, ఐసీడీఎస్ బృందాలు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాతాశిశు వైద్యసేవల విస్తరణ, మరణాల నియంత్రణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసవ సమయంలో మాతాశిశు మరణాలు సంభవించకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో సక్రమంగా విధులు నిర్వహించడం వల్ల మాతాశిశు మరణాలకు ఆస్కారం ఉండదన్నారు. ఇటీవల ముంచంగిపుట్టు, కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల పరిధిలో చోటుచేసుకున్న మాతృ మరణాలపై సంబంధిత వైద్య, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు. రక్తహీనత, బరువు తక్కువ బిడ్డలు, ఇతర వ్యాధులపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన పౌష్టికాహారంతో పాటు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. వీటిని వినియోగించే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. గర్భిణులకు బరువుతో పాటు హెచ్‌బీ పరీక్షలను తరచూ నిర్వహించాలని ఆదేశించారు. రక్తహీనత, హైరిస్క్ కేసులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెపటైటిస్ బి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నలుగురికి మించి పిల్లలను కనడం వల్ల మహిళలు రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా మరణాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయన్నారు. అలాంటి వారిని గుర్తించి కుటుంబ సంక్షేమ ఆపరేషన్లపై అవగాహన కల్పించాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి, ఏఎన్‌ఎం,ఆశా కార్యకర్త, సూపర్‌వైజర్ నుంచి సంజాయిషీ కోరాలని కలెక్టర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పాడేరు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ప్రత్యేక గుర్తింపు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వాడవాడలా మర్రి కామయ్య వర్ధంతి



అరకులో కామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

అరకులోయ రూరల్: ఆదివాసీ స్వాతంత్ర సమరయోధులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎదురుగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీటీజీ రిసార్ట్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ పాలకుల ముఠాదారి వ్యవస్థపై తిరుగుబాటు చేశారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విప్లవవీరుడు మర్రి కామయ్య పేరు కనుమరుగు అయ్యిందన్నారు. తమ ప్రభుత్వం మరుగున పడిన ఆదివాసీ విప్లవ వీరులు భావి తరాలకు తెలిసేలా గుర్తింపు కల్పిస్తోందన్నారు. ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజారమేష్ బోష్ మాట్లాడుతూ ఆదిమజాతి గిరిజనులకు స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. అనంతరం మర్రి కామయ్య కుటుంబసభ్యులు, బంధువులను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పీటీజీ నేతలు సత్తిబాబు, చిన్నారావు, కొండలరావు, బేసు, సాంబ, గణేష్, రాజారావు, మోహన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు: స్వాతంత్ర్య సమరయోధుడు,ఆదివాసీల ఆశాజ్యోతి మర్రి కామయ్య చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు పాల్గొన్నారు.

మర్రి కామయ్యకు ఘన నివాళి

హుకుంపేట : స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. మండలంలోని కామయ్యపేటలో ఆయన సమాధి వద్ద ఎంపీపీ కొర్ర నాగరాజు, జిల్లా గిరిజన ఐక్య వేదిక అధ్యక్షుడు లక్కే చిట్టిబాబు ఆధ్వర్యంలో కామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. ఉద్యోగులు, పలు పార్టీల నాయకులు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. థింసా నృత్యాలతో పండగలా వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ గిరిజన ఉద్యోగుల సంఘం, గిరిజన ఐక్య వేదిక సంఘం నాయకులు సతక చిట్టయ్య, శెట్టి జయదాస్, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సీపీఎం నాయకులు కృష్ణారావు, మాజీ సర్పంచ్ పల్టాసింగి కామేశ్వరరావు, మర్రి కామయ్య ఆశయసాధన సమితి సభ్యులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కూడా రాజబాబు, ప్రభుత్వ కళాశాలలో దండకారుణ్య విమోచన సమితి వ్యవస్థాపకుడు చెండ ఎలియా, ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో కామయ్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మర్రి కామయ్య చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



మర్రి కామయ్య సమాధి వద్ద ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గిరిజన ఐక్య వేదిక నాయకులు



కామయ్యపేటలో థింసా నృత్యం చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

8న పూజాసామగ్రి విక్రయానికి వేలం

దేవీపట్నం: పూడిపల్లి పంచాయితీలోని గండి పోశమ్మ ఆలయంలో సోమవారం టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ జి.వి.లక్ష్మీకుమార్ తెలిపారు. అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించిన కొబ్బరికాయలో సగభాగం పొందేందుకు, భక్తులు సమర్పించిన చీరలు, రవికలు పొందేందుకు, అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి, సీడీలు తదితరలు విక్రయించుకునేందుకు, అమ్మవారి ఫోటోల అమ్మకానికి సంబంధించి ఒక ఏడాది గడువునకు వేలంపాట నిర్వహించునున్నట్టు పేర్కొన్నారు. దేవాదాయ, ధర్మదాయ శాఖాధికారుల సమక్షంలో కార్యక్రమం జరుగుతుందని, వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చదరంగంలో సత్తా చాటుతున్న హార్దిక్



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో హార్దిక్(ఫైల్)

విశాఖ స్పోర్ట్స్: చదరంగం పోటీల్లో నగరానికి చెందిన చిన్నారి హార్దిక్ కలిదిండి అండర్–7 కేటగిరీలో సత్తా చాటుతున్నాడు. ఇటీవల ఫిడే రేటింగ్ చెస్ సమాఖ్య విడుదల చేసిన అండర్–7 చిన్నారుల కేటగిరీలో బెస్ట్‌గా నిలిచాడు. క్లాసిక్, రాపిడ్ చదరంగాల్లో తొలి స్థానాల్లో నిలిచిన హార్దిక్ బ్లిజ్‌లోనూ ప్రపంచ 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం సెర్బియాలో జరుగుతున్న చెస్ పోటీల్లో పాల్గొనేందుకు హార్దిక్ సిద్ధమవుతున్నాడు. హార్దిక్ నేషనల్ యంగెస్ట్ ప్లేయర్‌గా మూడున్నరేళ్ల వయసులోనే నేషనల్స్ స్కూల్స్ టోర్నీలో సత్తా చాటి.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును లిఖించుకున్నాడు.

పేదలకు వరం.. సర్కారు వైద్యం

- ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు
- అందుబాటులో శస్త్రచికిత్సలు



చింతూరు ఏరియా ఆస్పత్రి

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో క్రమేపీ అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా ఈ ఆస్పత్రిలో ఎముకల శస్త్రచికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ ఆస్పత్రిని సందర్శించారు. మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన ప్రజలకు ఈ ఆస్పత్రిలో అనేక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. కాన్పులు, అధునాతన పరీక్షల కోసం గతంలో భద్రాచలం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆస్పత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులను నియమించడంతో ఎంతటి క్లిష్ట పరిస్థితి ఉన్నా కాన్పులను సైతం ఇక్కడే చేస్తున్నారు. దీంతో పాటు వివిధ వ్యాధులకు సంబంధించిన పరీక్షల కోసం అధునాతన పరికరాలు అందుబాటులో తీసుకువచ్చారు. దీంతో ఖరీదైన పరీక్షలు కూడా ఇక్కడ లభ్యమవుతున్నాయి.

ఎముకల శస్త్ర చికిత్సలు

ఆస్పత్రిలో ఇటీవల ఎముకల శస్త్రచికిత్సలు కూడా అందుబాటులోకి రావడంతో నాలుగు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో ప్రధానంగా తల, చేతులు, కాళ్లకు దెబ్బలు తగిలి ఎముకలు విరిగిన క్షతగాత్రులు అధిక సంఖ్యలో ఉంటున్నారు.

ఇప్పటివరకు వీరికి ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం, రంపచోడవరం, రాజమహేంద్రవరం ఆస్పత్రులకు పంపించేవారు. తాజాగా ఎముకలు, చెవి, ముక్కు, గొంతుకు శస్త్రచికిత్సల నిర్వహణకు అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.10లక్షలు మంజూరయ్యాయి. దీంతో శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాన్ని కొనుగోలు చేసి శుక్రవారం నుంచి శస్త్రచికిత్సలు ప్రారంభించినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు.

తొలి శస్త్రచికిత్స

వీఆర్ పురం మండలం సోములగూడెనికి చెందిన మిడియం కృష్ణ గత నెల 29న బైక్‌పై వెళ్తూ కింద పడడంతో ఎడమచేతి పొడవు ఎముక కింద భాగం విరిగింది. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి వచ్చిన అతడికి తగిన పరీక్షలు నిర్వహించి ఎముకల శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ కౌశిక్, మత్తుమందు నిపుణుడు డాక్టర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స పరికరానికి నిధులు మంజూరు చేసిన కలెక్టర్, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్న ఐటీడీఏ పీవోకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన ఆస్పత్రి సిబ్బందిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అభినందించారు.

భూ వివాదంతోనే మహిళ హత్య

కేసు దర్యాప్తులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

చింతపల్లి: గూడెంకొత్త వీధి మండలం దారకొండ కాలనీలో గిరిజన మహిళను హతమార్చిన నిందితుడిని అరెస్ట్ చేశామని అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ శుక్రవారం తెలిపారు. ఏఎస్పీ వివరాల మేరకు... భూ వివాదంతోనే ఆమెను హత్య చేశాడన్నారు. కాలనీకి చెందిన గడుతూరి వలసమ్మ(53)కు తన బంధువైన గడుతురు నాగేశ్వరరావుతో కొంత కాలంగా డీ–ఫారం పట్టా భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో వలసమ్మ పాడేరు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గత నెల 29న గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించి భూవివాదం కారణాలను గ్రామ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. దీంతో వలసమ్మపై నాగేశ్వరరావు కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 30న జీడితోటలో ఒంటరిగా వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, పదునైన కత్తితో చంపేందుకు ప్రయత్నించాడు. ఆమె తప్పించుకుని పారిపోతుండగా అతడు వెంటపడి విచక్షణా రహితంగా నరికాడు. దీంతో ఆమె కేకలు పెట్టడంతో సమీపంలో ఉన్నవారు అక్కడికి చేరుకున్నారు. వెంటనే నిందితుడు పొదల్లో కత్తి విసిరేసి, రక్తం మరకలంటుకున్న బట్టలను వేరేచోట దాచి సమీప గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లిపోయాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జి.కె.వీధి సీఐ అశోక్‌కుమార్ కేసును ఛేదించి నిందితుడిని పట్టుకునట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీలేరు ఎస్సై అప్పల సూరి తదితరులు పాల్గొన్నారు.

పది జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు

రాజవొమ్మంగి: మండలంలోని పది జంటలకు (నూతన వధూవరులకు) ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు ప్రోత్సాహకం మంజూరు చేసినట్టు స్థానిక ఎంపీడీఓ బాపన్నదొర శుక్రవారం విలేకరులకు తెలిపారు.

జడ్డంగి సచివాలయ పరిధిలో మూడు, రాజవొమ్మంగి–1, –2 సచివాలయాల పరిధిలో రెండు జంటలకు, అమీనాబాద్, వంచంగి, గడుఓకుర్తి, చెరకుంపాలెం, దూసరపాము సచివాలయాల పరిధిలో ఒక్కటి చొప్పున కళ్యాణమస్తు మంజూరైనట్టు వివరించారు.

అర్ధరాత్రి జీపు బోల్తా

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- సిరశపల్లి సమీపంలో ఘటన



జీపు బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన దిలీప్‌కుమార్

పెదబయలు: మండలంలోని గలగండ గ్రామ సమీపంలో పాడేరు నుంచి ఒడిశా వెళ్తున్న జీపు బోల్తా పడింది. గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... జి.మాడుగుల మండలం సింగర్భ పంచాయతీ నిట్టపుట్టు గ్రామానికి చెందిన సుమారు పది మందితో ఈ నెల 4న రాత్రి 11.30 గంటలకు ఒడిశాలోని గొల్లోరి గ్రామంలో తమ బంధువుల గృహ ప్రవేశానికి బయలుదేరారు. ఈ క్రమంలో పెదబయలు మండలం గలగండ పంచాయతీ సిరశపల్లి గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా పశువులు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో బ్రేక్ వేయడంతో రోడ్డు పక్కన జీపు బోల్తా పడింది. నిట్టాపుట్టు గ్రామానికి చెందిన పరదాని దిలీప్‌కుమార్(25) జీపు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీపులో ఉన్న మాడేం భూలోకమ్మకు కాలు, చేయి విరిగింది. మిగిలిన 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే రాత్రి సమయంలోనూ స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సకాలంలో తరలించి వైద్య సేవలందించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు.

సింహగిరికి వైశాఖ పౌర్ణమి శోభ

- భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి
- విశేషంగా తరలివచ్చిన గరిడి బృందాలు



భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి ప్రాంగణం

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణులు, ఒడిశా రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము ఒంటి గంట నుంచే కొండదిగువ వరాహ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలకు పూజలు చేశారు. స్వయంగా వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు. మెట్లమార్గం ద్వారా సింహగిరికి నడిచి వెళ్లి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. గరిడి వాయిద్యాలతో స్వామిని కీర్తించారు. స్నానాలు చేసేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి కళకళలాడింది. సహపంక్తి భోజనాలు చేసే భక్తులతో అడవివరం ప్రాంతంలోని గురువారం సంత ప్రాంగణం, ప్రియాగార్డెన్స్, హవేలి ప్రాంగణం, పాత అడవివరంలోని మామిడి తోటలు కిటకిటలాడాయి. మార్కెట్ కూడలి నుంచి వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిక్కిరిసింది. పుష్కరిణి వద్ద దేవస్థానం గార్డులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. మార్కెట్ కూడలి నుంచి వరావ పుష్కరిణి వరకు వాహనాల రాకపోకలను నిషేధించారు. దర్శనానికి వెళ్లిన భక్తులతో సింహగిరి మెట్లమార్గం, సింహగిరిపై ఉన్న క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల రద్దీగా కనిపించింది. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆనందమానందమాయె..

- సీఎం జగన్ చిత్రపటానికి 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల క్షీరాభిషేకం
- పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రశంసల జల్లు
- ఉమ్మడి విశాఖ పరిధిలోని మూడు జిల్లాల్లో ఏర్పాటైన టీచర్స్ అసోసియేషన్లు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రమణమూర్తి



సమావేశానికి హాజరైన మూడు జిల్లాల ఎంటీఎస్ ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: ఎప్పుడో పాతికేళ్ల క్రితం ఉపాధ్యాయులుగా స్థిరపడాల్సినవారు.. కాలం కలిసిరాక నిరుద్యోగులుగా మిగిలిపోయారు.. ఏదో ఒక వృత్తిలో కుదురుకొని డీఎస్సీకి ఎంపికైన విషయం కూడా మరిచిపోయారు.. పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ కృతజ్ఞత తెలుపుకున్నారు. అనకాపల్లి జిల్లా సీఐటీయూ కార్యాలయంలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారంటూ ప్రశంసల జల్లు కురిపించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 1998 డీఎస్సీ ఉద్యోగులంతా హాజరై సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 4072 మందిని గురువుల స్థానంలో నిలబెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్పారు.

మేలు మరచిపోలేం..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడిపోయాం. 1998 డీఎస్సీ రాసి చాలిచాలనీ జీతాలకు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా తలరాత మారిపోయింది. ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నానంటే అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన భిక్షే.

– లాలం గణేశ్వరరావు, నర్సీపట్నం

ఇటువంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు



ఇటువంటి సీఎంను నేనెప్పుడూ చూడలేదు. 1998లో డీఎస్సీ పాసై అయి ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూసిన కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి నిజం చేశారు. ఆయన నిరుద్యోగుల పక్షపాతి. వారికి మేలు చేయాలని కోరుకునేవారు. ఆయన వల్లే మా ఆశ ఫలించింది.

– సూర్యకళ, డుంబ్రిగుడ

రుణపడి ఉంటాం..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే మాకు టీఎంఎస్ ఉద్యోగాలు వచ్చాయి. 25 ఏళ్ల సుదీర్ఘపోరాటం తర్వాత మాకు ఉపాధ్యాయ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. మా కుటుంబంలో వెలుగులు నింపిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

–పి.అప్పలరాజు, భీమిలి

ఎస్‌ఈబీకి చిక్కిన గంజాయి ముఠా

- డబ్బుకు ఆశపడి గంజాయి రవాణా
- పట్టుబడిన వారిలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు
- 18 కేజీల గంజాయి, ఐదు మొబైళ్లు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): కమీషన్‌కు ఆశపడి హోల్‌సేల్ వ్యాపారి నుంచి కొనుగోలుదారులకు గంజాయిని చేరుస్తున్న ఓ ముఠా గుట్టును ఎస్‌ఈబీ అధికారులు రట్టు చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఏఎస్పీ, ఎస్‌ఈబీ క్రైమ్ ఇన్‌చార్జి డి.హిమవతి వివరాలను వెల్లడించారు. మాదకద్రవ్య రహిత జిల్లానే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. ఏఎస్పీ పర్యవేక్షణలో ఎస్‌ఈబీ, పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా దాడులు ముమ్మరం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌ఈబీ పోలీస్ టీం ఇన్‌స్పెక్టర్ హెచ్‌ఎస్ హుస్సేన్‌బాషా, కావలి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు ముమ్మరం చేశారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కుల్లంపట్టి ప్రాంతానికి చెందిన రమేష్‌రాజు, కాకినాడ జిల్లా శంఖవరం మండలం కొత్తంగి గ్రామానికి చెందిన ఆర్.గణేష్, విశాఖ జిల్లా రోలుగుంట మండలానికి చెందిన కె.సాయి, కాకినాడ జిల్లా శంఖవరం మండలానికి చెందిన ఎం.అనంత, పత్తిపాడు మండలం దారాపల్లి గ్రామానికి చెందిన ఎస్.లోవాకుమారిని అరెస్ట్ చేసి, 18 కేజీల గంజాయిని, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కమిషన్ తీసుకుంటూ..

రమేష్‌రాజు లారీ డ్రైవర్. ఆరునెలల క్రితం యాక్సిడెంట్ కావడంతో కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. దీంతో డ్రైవింగ్ చేయడం కష్టతరంగా మారింది. అతని యజమాని గంజాయి విక్రయదారుడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగరాజుమడుగు (జి.మాడుగుల) ప్రాంతానికి చెందిన సరఫరదారుని వద్ద గంజాయి కొనుగోలుచేసి సేలంతోపాటు సమీప ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. రమేష్‌రాజు పరిస్థితిని చూసిన ఆయన జి.మాడుగల నుంచి గంజాయి తనకు తెచ్చి ఇచ్చిన ప్రతిసారి రూ.10 వేలు కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. దీంతో రమేష్‌రాజు కొంతకాలంగా గుట్టచప్పుడు కాకుండా గంజాయిని తెచ్చి ఇస్తున్నాడు.

- ఆర్.గణేష్, కె.సాయి, ఎం.అనంత, ఎస్.లోవా కుమారి రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేసేవారు. సంపాదన సరిపోవడంలేదని జి.మాడుగులకు చెందిన గంజాయి సరఫరాదారుడితో పరిచయం పెంచుకున్నారు. ఆయన కేరళలో తాను చెప్పిన వ్యక్తులకు గంజాయి ఇచ్చిన ప్రతిసారి రూ.10 వేలు కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. వారు కొంతకాలంగా జి.మాడుగుల నుంచి కేరళకు గంజాయిని తీసుకెళ్లి అక్కడ విక్రయదారులకు ఇస్తున్నారని విచారణలో బయటపడింది. ఐదుగురితోపాటు జి.మాడుగులకు చెందిన గంజాయి హోల్ సేల్ సరఫరాదారుడు, అతని బావ మరిదిపై సైతం ఎస్‌ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు. సమావేశంలో ఎస్‌ఈబీ ఈఎస్ ఎస్.రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, పోలీస్ టీం ఎస్సై బాలకృష్ణ పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా చందనం సమర్పణ

- విశేషంగా స్వామికి పంచకలశ స్నపనం



చందనంతో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

సింహాచలం: వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం రెండో విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. ఆలయ ఆస్థానమండపంలో స్వామి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఉదయం 6.30 గంటలకు అధిష్ఠింపజేశారు. గంగధారల జలాలు, పంచామృతాలతో స్నపనం నిర్వహించి, విశేషంగా హారతులిచ్చారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు గిరి, పవన్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమాలను చేపట్టారు.